ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

తమిళనాడు
TAMILNADU
బుధవారం 31 జూలై 2024

డిసెంబర్‌లో 'పంచాయతీ'

● ఎన్నికల నిర్వహణ కోసం ఈసీ సన్నాహాలు



చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలను డిసెంబర్‌లో జరిపేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మర సన్నాహాలు చేపడుతోంది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పాటైన 9 జిల్లాలు మినహా తక్కిన జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీ కాలం డిసెంబర్‌తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆ గ్రామపంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఆ మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా తమకు అందజేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహూకు కోయంబేడులో ఉన్న రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి కె.బాలసుబ్రమణ్యం లేఖ రాశారు. డిసెంబర్‌లో పదవీ కాలం ముగియనున్న గ్రామీణ పంచాయితీలకు ఎన్నికలు జరుపనున్నామని, ఆ ఎన్నికల కోసం తాజా ఓటర్ల జాబితా అవసరమవుతోందని, వీలైనంత త్వరగా వాటిని తమకు పంపాలని సత్యప్రద సాహూకు విజ్ఞప్తి చేశారు. ఈ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అనువైన సమయంలో నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి పేర్కొన్నారు.

శ్రీవిల్లిపుత్తూరులో ఆడిపూర రథోత్సవ వేడుకల ప్రారంభం

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాల్లో అత్యంత ప్రసిద్ధి చెందిన విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ (గోదాదేవి) ఆలయంలో ఆడిపూర రథోత్సవ వేడుకలు మంగళవారం ఉదయం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఈ క్షేత్రం శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్, పెరియాళ్వార్ అనే ఇద్దరు ఆళ్వార్లు అవతరించిన దివ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయంలో ఆండాళ్ అవతార దినమైన ఆడి మాసం పూరం నక్షత్రం రోజున జరిగే ఆడిపూర రథోత్సవ వేడుకలు అత్యంత ప్రసిద్ధమైనవి. ఈ యేడాది ఆడిపూర రథోత్సవ వేడుకలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా ఆండాళ్, రంగమన్నార్‌లకు తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ధ్వజ పతాకాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి ఉదయం 9 గంటలకు ఎగురవేశారు. ఈ వేడుకలలో శ్రీవిల్లిపుత్తూరు మనవాళ మామునిగళ్ మఠానికి చెందిన శఠగోపరామానుజ జీయర్ , రామ్‌కో గ్రూపు డైరెక్టర్ నిర్మలా రాజు, రామ్‌కో విద్యా సంస్థ డైరెక్టర్ శ్రీకంఠన్ రాజా, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సెల్లదురై, కార్యనిర్వహణాధికారి లక్ష్మణన్, ట్రస్టీలు పాల్గొన్నారు. ఉత్సవాల్లో తొలిరోజైన మంగళశారం రాత్రి ఆండాళ్, రంగమన్నార్ షోడశ శకట సప్పరంలో వీధులలో ఊరేగారు. ఇక ఆగస్టు 2న రంగమన్నార్ గోవర్ధనగిరిధారిగా, ఆండాళ్ శేషవాహనంలోను భక్తులకు కనువిందు చేయనున్నారు. ఆగస్టు 3న పెరియాళ్వార్ మంగళాశాసనం, అదే రోజు రాత్రి రంగమన్నార్, పెరియ పెరుమాళ్, తిరువణ్ణామలై శ్రీనివాస పెరుమాళ్, సెన్బగతోప్పు కాట్టళగర్, తిరుత్తంగళ్ నింద్ర నారాయణ పెరుమాళ్ గరుడ సేవల్లో భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ పంచగరుడ మహోత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొనున్నారు. 5న శయన సేవ జరుగుతుంది. తొమ్మిదో రోజైన ఆగస్టు 7, ఉదయం 9 గంటలకు తిరు ఆడిపూర రథోత్సవం అత్యత వైభవంగా నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకారంలో ఆండాళ్, రంగమన్నార్, ధ్వజారోహణం చేస్తున్న వైష్ణవపండితులు

కేరళలో ప్రకృతి విళయం

స్టాలిన్ రూ.5 కోట్ల సాయం

● పినరయి విజయన్‌కు ఫోన్ చేసిన సీఎం



వయనాడ్‌లో వరద బీభత్సం

ప్యారీస్, జూలై 30: కేరళ రాష్ట్రంలోని వయనాడు జిల్లాలో ప్రకృతి విళయానికి అనేకమంది సజీవ సమాధి కావడం, ఆస్తులు గంగపాలు కావడంపై తమిళనాడు ప్రభుత్వం తరఫున సహాయ చర్యల కోసం కేరళకు రూ.5 కోట్ల సాయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వయనాడు జిల్లాలో కురిసిన భారీవర్షాల కారణంగా మట్టిపెళ్లలు విరిగిపడి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కేరళ ప్రభుత్వానికి తమిళనాడు తరఫున అన్నివిధాల సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఫోన్లో ముఖ్యమంత్రి స్టాలిన్ హామీ ఇచ్చారు. బాధిత ప్రాంతాల్లో సహాయక పనుల్లో పాల్గొనేందుకు 20 మందితో కూడిన అగ్నిమాపక శాఖ, సహాయ సిబ్బంది, 10 మంది వైద్యులు, వైద్య సిబ్బంది, 20 మందితో కూడిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను తక్షణం కేరళకు వెళ్లాల్సిందిగా సీఎం స్టాలిన్ ఆదేశించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో మాట్లాడి అక్కడి పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి వీలైనంత సహాయాన్ని అందించగలమని హామీ ఇచ్చారు.ఈక్రమంలోనే, బాధిత ప్రాంతాల్లో నివారణ పనులు పర్యవేక్షించేందుకు, కేరళ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు రాష్ట్రం నుంచి ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులైన డా.సమీరన్, జాన్ టామ్ వర్గీస్‌లను కూడా సీఎం కేరళకు పంపించారు.

తమిళనాడు రైళ్ల రద్దు...

కేరళ రాష్ట్రంలో ప్రకృతి విలయం తాండవమాడిన నేపథ్యంలో, పలు జిల్లాలు వరద ముంపుకు గురయ్యాయి. దీంతో రాష్ట్రం నుంచి కేరళకు వెళ్లే పలు రైళ్లను రద్దుచేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. త్రివేంద్రం డివిజన్ పరిధిలోని వల్లతోల్, నగర్‌వడకంజేరి రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలు వరద ప్రవాహంలో మునిగిన కారణంగా 20 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. తిరునల్వేలి జంక్షన్ నుంచి సోమవారం రాత్రి బయల్దేరిన బాలరువి ఎక్స్‌ప్రెస్‌ను పాలక్కాడులో నిలిపివేశారు. అలువా-పాలక్కాడు మధ్య రైళ్లను నిలిపివేశారు.పాలక్కాడుజంక్షన్ నుంచి తిరునల్వేలికి సోమవారం బయల్దేరాల్సిన బాలరువి ఎక్స్‌ప్రెస్ అలువా రైల్వేస్టేషన్ నుంచి మంగళవారం సాయంత్రం 6.05 గంటలకు బయల్దేరుతుందని ప్రకటించింది. సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి కన్నియాకుమారి బయల్దేరాల్సిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సేరనూరు జంక్షన్ వరకు నడుపుతున్నట్లు ప్రకటించింది. అలాగే, సేరనూరు-కన్నియాకుమారి మధ్య నడిపే రైళ్లు రద్దయ్యాయి. కన్నియాకుమారి నుంచి బయల్దేరాల్సిన పరశురామ్ ఎక్స్‌ప్రెస్ సేరనూరు రైల్వేస్టేషన్ నుంచి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

సీఎంతో క్రెడాయ్ ప్రతినిధుల భేటీ...

'క్రెడాయ్' తమిళనాడు, చెన్నై విభాగాల ప్రతినిధులు ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. భవన నిర్మాణానికి అనుమతుల ప్రక్రియలో ప్రభుత్వం దార్శనికతతో కూడిన సంస్కరణలు చేపట్టినందుకు ఈ సందర్భంగా వారు సీఎంను అభినందించారు. ఈ సమావేశంలో సీఎంతో పాటు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్షుల్ మిశ్రా తదితరులు కూడా పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో 'క్రెడాయ్' తమిళనాడు, చెన్నై విభాగాల ప్రతినిధులు

రేషన్ దుకాణాల్లో మద్యం, కల్లు

● హైకోర్టులో పిటిషన్

● ప్రభుత్వ వివరణ కోరిన ధర్మాసనం



పెరంబూర్, జూలై 30: కల్లు విక్రయాలపై విధించిన నిషేధం ఎత్తివేయడంతో పాటు, సూపర్ మార్కెట్లు, రేషన్ దుకాణాల్లో మద్యం విక్రయాలు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అభిప్రాయం చెప్పాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. స్థానిక కొరట్టూరుకు చెందిన మురళీధరన్ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... 2003 నుంచి టాస్మాక్ ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, చిల్లర విక్రయాల్లో అదనంగా డబ్బులు వసూలు చేస్తుండడంతో, సుమారు రూ.1,000 కోట్లకు పైగా అవినీతి జరుగుతోందన్నారు. ఈ నగదు సేల్స్‌మెన్ నుంచి ఆ శాఖ మంత్రి వరకు వాటాలు అందుతున్నట్లు ఆరోపణలున్నాయన్నారు. ప్రధానమైన మద్యం తయారీ కంపెనీలు అధికార, ప్రతిపక్ష నాయకులకు చెందినవని, అందువల్ల నిర్దేశిత బ్రాండ్ మద్యం విక్రయాలు మాత్రమే అధికంగా జరుగుతున్నాయన్నారు. మద్యం కంటే కల్లులో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉందని, కేరళ, ఆంధ్ర, కర్ణాటక, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల్లో కల్లు విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఆరోగ్యం ప్రామాణికంగా తీసుకొని రాష్ట్రంలో కల్లు విక్రయాలపై విధించిన నిషేధం ఎత్తివేయాలని, సూపర్ మార్కెట్లలో అన్నిరకాల మద్యపానీయాలు, రేషన్ దుకాణాల్లో తక్కువ ధరకు మద్యం, కల్లు విక్రయాలు చేపట్టేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణన్‌కుమార్, న్యాయమూర్తి జస్టిస్ కుమరేష్ బాబుతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ విషయంపై అభిప్రాయం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను 8 వారాలకు వాయిదావేసింది.

అంతర్జాతీయ క్రీడల్లో తమిళసత్తా చాటండి

● మంత్రి ఉదయనిధి

ప్యారీస్, జూలై 30: రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లోనూ సత్తా చాటి మరిన్ని పతకాలు సాధించి తమిళనాడుకు ఘనత చేకూర్చాలని యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని పతకాలు గెలుచుకున్న 589 మంది క్రీడాకారులకు రూ.13.98 కోట్ల ప్రోత్సాహన చెక్కులను మంత్రి ఉదయనిధి అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడారంగంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న రాష్ట్ర క్రీడాకారులను ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, సత్తా చాటుతున్న క్రీడాకారులు ఒక్క సీఎం మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రజలు మెచ్చుకొనేలా ఉండాలన్నారు. ఒలింపిక్స్‌లో భారతదేశం తరఫున పాల్గొన్న 117 మంది క్రీడాకారుల్లో తమిళనాడు నుంచి 11 మంది, ప్రత్యేక ప్రతిభావంతులు ఆరుగురున్నారని, వీరి ప్రయాణ ఖర్చులకు తలా రూ.7 లక్షల చొప్పున రూ.1.19 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొన్న పలువురు ఫుట్‌బాల్ క్రీడాకారుల్లో ఒకరైన ఇందుమతి తన జీవితంలో పలు కష్టాలు అధిగమించి నేడు భారత మహిళ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్‌గా ఎదిగారని, ఆమె ఆ క్రీడలో రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తమిళనాడు ఛాంపియన్స్ ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయం పొందగోరే క్రీడాకారులు www.sdat.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ద్రావిడ మోడల్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో 2,756 మంది క్రీడాకారులకు రూ.90.24 కోట్లు ప్రోత్సాహకంగా అందజేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ అతుల్య మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథరెడ్డి, ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఇందుమతి, ఫెన్సింగ్ క్రీడాకారిణి భవానిదేవి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహక నగదు చెక్ అందజేస్తున్న మంత్రి ఉదయనిధి


అమ్మా క్యాంటీన్ల మరమ్మతుకు రూ.7 కోట్లు

● వృత్తి పన్ను 35 శాతం పెంపునకు సిఫారసు

● పశువులు పట్టుబడితే రూ.10 వేల జరిమానా

● కార్పొరేషన్ మీట్‌లో తీర్మానాలు

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో పేద, మధ్యతరగతి వారి కోసం నడుపుతున్న అమ్మా క్యాంటీన్ల మరమ్మతులకు రూ.7 కోట్ల మేర విడుదల చేయాలని కార్పొరేషన్ సమావేశం తీర్మానించింది. మంగళవారం ఉదయం రిప్పన్‌భవనంలో మేయర్ ఆర్. ప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే మాజీ కార్పొరేటర్ ఆమ్‌స్ట్రాంగ్ మృతికి సంతాపం ప్రకటిస్తూ సభ్యులంతా మౌనం పాటించారు. ఆ తర్వాత రాష్ట్రానికి నిధులు కేటాయించలేదంటూ ఎండీఎంకే కార్పొరేటర్ జీవన్, సుబ్రమణియన్, కేంద్ర బడ్జెట్ ప్రతులను చింపి తమ నిరసన వ్యక్తం చేశారు. ఇదే విధంగా కాంగ్రెస్ కార్పొరేటర్లు కూడా బడ్జెట్ నకళ్లను చింపి నిరసన తెలిపారు. ఆ తర్వాత ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులడిగిన ప్రశ్నలకు మేయర్, డిప్యూటీ మేయర్ సమాధానాలిచ్చారు. కాగా జీరో అవర్‌లో 18 మంది కార్పొరేటర్లు వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ సమావేశంలో నెలసరి వేతనాలు పొందుతున్నవారి నుంచి వసూలు చేస్తున్న వృత్తి పన్ను 35 శాతం మేర పెంచేందుకు ప్రభుత్వాన్ని కోరుతూ ఓ తీర్మానం ప్రతిపాదించారు. వ్యాపారం చేయడానికి చెల్లించే రుసుము పెంచాలని, చిన్న తరహా, కుటీర, మధ్యతరహా, భారీ పరిశ్రమల నుంచి వసూలు చేసే రుసుము కూడా పెంచాలని తీర్మానాలు ప్రతిపాదిస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. నగరంలోని రోడ్లపై పశువులు సంచరిస్తూ పట్టుబడితే వాటి యజమానులకు విధిస్తున్న జరిమానాను రూ.5వేల నుండి రూ.10 వేలకు పెంచాలని, కార్పొరేషన్ పశువుల పాకలో ఉన్న ఆ పశువుల సంరక్షణకు అయ్యే ఖర్చు కూడా వాటి యజమానుల నుంచే వసూలు చేయాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో కమిషనర్ గురుబరన్, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

జీసీసీ సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ ఆర్. ప్రియ - సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

అమ్మా క్యాంటీన్లకు కొత్త సొబగులు..

ఈ సమావేశంలో మేయర్ ప్రియ మాట్లాడుతూ... గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 200 వార్డుల్లో, ఏడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కలిపి 390 అమ్మా క్యాంటీన్లు నడుపుతున్నామని, ఆ క్యాంటీన్లలో కొత్త వంట పాత్రలకు, యంత్రాలను మరమ్మతులకు, వీలైతే పాతవాటికి బదులు కొత్త యంత్రాలను అమర్చటానికి, క్యాంటీన్‌లో పరిశుభ్రత మెరుగుపరచటానికి తదితర పనులకు రూ.7 కోట్ల మేరకు నిధులు కేటాయించేందుకు సభ్యులందరూ అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మొత్తం 70 తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించినట్లు ఆమె తెలిపారు.

బావి తవ్వుతుండగా ప్రమాదం

● ముగ్గురు కార్మికుల మృతి



మృతులు తనికాచలం, హరికృష్ణన్, మురుగన్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, జూలై 30: విల్లుపురం జిల్లా తిరువెన్నయనల్లూర్ సమీపంలోని అరుంగురిక్కై గ్రామంలో బావి తవ్వే సమయంలో తాడు తెగిపడడంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. వివరాలిలా వున్నాయి... కన్నన్ అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమిలో 10 రోజులు క్రితం బావి తవ్వడం ప్రారంభమయ్యాయి. తిరుకోవిలూర్ సమీపం పెరుంగరుక్కై గ్రామానికి చెందిన తనికాచలం (48), నరిపాళయం గ్రామానికి చెందిన హరికృష్ణన్ (40), ఉళుందూర్‌పేట సమీపం నైవనై గ్రామానికి చెందిన మురుగన్ (38) బావి తవ్వేందుకు పనికి వచ్చారు. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి 8 గంటల సమయంలో పనులు ప్రారంభించిన వీరు.. ఎక్సకవేటర్‌కు ఇనుప తాడుతో బకెట్ బిగించి బావిలోకి దిగారు. ఆ సమయంలో ఊహించని విధంగా తాడు తెగిపోవడంతో ముగ్గురూ వందడుగుల బావిలో పడిపోయారు. ఎత్తునుంచి పడడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న మృతుల బంధువులు అక్కడకు చేరుకొని ఈ ప్రమాదానికి కారణమైన ఎక్సకవేటర్ డ్రైవర్, భూమి యజమాని, వీరిని పనిలోకి తీసుకొచ్చిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న తిరువెన్నయనల్లూర్ పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేసి, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

ఇంటి గోడ కూలి...

కోయంబత్తూర్ జిల్లా వాల్పారై సమీపంలో ఇంటి గోడ కూలిన ఘటనలో అవ్వ, మనవరాలు మృతిచెందారు. వాల్పారై సోమవారం ఉదయం నుంచి భారీవర్షం కురుస్తుండంతో వాల్పారై తాలూకాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సోలయార్ నది ఎడమ గట్టు సమీపంలోని ఇంటి గోడ కూలి రాజేశ్వరి, ఆమె మనవరాలు ధనప్రియ మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గోడ శిథిలాల నుంచి ఇరువురిని వెలికితీసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

డీఎంకే-కాంగ్రెస్ నడుమ అంతా సవ్యమే?

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డీఎంకే-కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది.. నిన్న లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది... కానీ ఇంతలోకే ఏమైందో తెలియదుగానీ ఆ రెండు పార్టీల నేతల నడుమ మాటల యుద్ధం నెల కొంది. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా? లేక యాదృచ్ఛి కమా అన్నదానిపై ఆ రెండు పార్టీల నేతలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు కాంగ్రెస్ అగ్రనేతలతో సన్నిహిత సంబంధాలున్నాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అయితే ఏకంగా స్టాలిన్‌ను తన సోదరుడని చెబుతారు. అంతేగాక ఎన్‌డీఏ కూటమిని ఎదుర్కోవడంలో ఈ రెండు పార్టీలు కలిసికట్టుగానే సాగుతున్నాయి. 2003 నుంచి కొనసాగుతున్న ఈ బంధం జాతీయ స్థాయిలో పటిష్ఠంగానే వుంది. నిజానికి ఎన్‌డీఏ నుంచి ఆహ్వానం వచ్చినా స్టాలిన్ అటువైపు మొగ్గుచూపలేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీ స్థాయిలో ఈ రెండు పార్టీలు కలసికట్టుగా వుండడంతో పాటు భవిష్యత్తులోనూ ఐకమత్యంతోనే వుంటామన్న సంకేతాలూ ఇస్తున్నాయి. ఇంతలోనే ఏమైందో గానీ రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఒంటరిగా ఎదగాలని, రాష్ట్రంలో ఒంటరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయికి చేరుకోవడంతో పాటు కామరాజర్ పాలన తీసుకురావాలన్న ఆలోచన పుట్టుకొచ్చింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా నియమితులైన సెల్వ పెరుందగై ఇలాంటి ఆలోచనలకు బీజం వేసినట్లు కనిపిస్తోంది. ఒకవైపు డీఎంకే కూటమిలో వుంటూనే .. 'ఒంటరిగా మనం ఎందుకు ఎదగకూడదు? ఎంతకాలం ఇలా ద్రావిడ పార్టీల చాటున ఉంటాం. సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయికి చేరుకోవాలి' అంటూ ఆయన బహిరంగ సభల్లో చేసిన వ్యాఖ్యలు 'ఇండియా' కూటమిలో దుమారం రేపాయి. అదే సమయంలో మరో నేత శివగంగై లోక్‌సభ సభ్యుడు సైతం ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో పార్టీ కార్యకర్తలే ఉలిక్కిపడ్డారు. ఎంతకాలం ఏదో ఒక పార్టీకి పల్లకి మోయాలని, సొంతంగా ఎదిగేందుకు ప్రయత్నించాలంటూ ఆయన వ్యాఖ్యానించారు. నిజానికి కార్తీక్ తండ్రి చిదంబరానికి, స్టాలిన్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. అలాంటి నేత కుమారుడే రెండు పార్టీల మధ్యం చిచ్చురేపేలా వ్యాఖ్యానించడమేంటని డీఎంకే నేతలు ప్రశ్నిస్తున్నారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఏంటో తెలుసుకుని మాట్లాడితే బావుంటుందంటూ ఆ పార్టీ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ వివాదాన్ని చల్లబరిచే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే రెండు పార్టీల నడుమ అనుమానాలు మొదలైనట్లు కనిపిస్తోంది. కార్తీక్ వ్యాఖ్యలకు మంత్రి పెరియకరుప్పన్ ఘాటుగా బదులిచ్చారు.. తమ పల్లకీ ఎవరో మోయాలని తామూ కోరుకోవడం లేదని, సొంతంగా ఎదగాలనుకుంటే కాంగ్రెస్ ఇష్టమని ఆయన నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. ఇదిలా వుండగా సొంతంగా పోటీ చేసే స్థాయి కాంగ్రెస్‌కు లేదని, గతంలో ఇలా ఒంటరి పోటీ చేసి బొక్కబోర్లా పడ్డామని ఆ పార్టీకి చెందిన నేతలే గుర్తు చేస్తున్నారు. అయితే డీఎంకే పెత్తనం మరీ ఎక్కువైందని, కేంద్రంలో తమ కూటమికి అధికారం వస్తే ప్రభుత్వంలో భాగస్వామ్యం పొందుతున్న డీఎంకే.. ఇక్కడ మాత్రం తమను దూరంగా పెట్టడం సరి కాదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా ద్రావిడపార్టీల్లో ఏదో ఒకదానితో కలిసి సాగడం మినహా కాంగ్రెస్‌కు మరో గత్యంతరం లేదని ఆ పార్టీ సీనియర్లు పరిస్థితి వివరిస్తున్నారు. కాగా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యల పట్ల డీఎంకే నేతలు కినుక వహించినట్లు కనిపిస్తోంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను వదులు కుని పోటీ చేయాలని ఆ పార్టీ సీనియర్లు కొందరు స్టాలిన్‌కు సూచించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీకి సీట్లు ఇవ్వడం వల్ల తాము పలు స్థానాలు కోల్పోవాల్సి వస్తోందని, అందువల్ల ఈ సారి ఆ భర్తీ పూర్తి చేసుకుందామంటూ వారు సూచించినట్లు తెలిసింది. కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రచారం చేయడం నుంచి బూత్‌ల్లో పోలింగ్ వరకూ అన్నీ తామే చేసిపెట్టినా, ఇంకా వారు తమను డిమాండ్ చేయడమేంటని డీఎంకే నేతలు ప్రశ్నించారు. ఇటీవలే పార్టీ పెట్టిన విజయ్ కూడా.. ఒంటరి పోటీకి సిద్ధమవుతున్నట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో తాము కూడా ఎందుకు ఒంటరిపోటీ చేయకూడదని డీఎంకే నేతలు స్టాలిన్ దగ్గర ప్రస్తావించినట్లు తెలిసింది. ఈసారి కనీసం 200 స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేద్దామని, ఢిల్లీలో పొత్తుల సంగతి తరువాత ఆలోచిద్దామని వారు గట్టిగా చెప్పినట్లు సమాచారం. అయితే అందరి సూచనల్ని ఆలకించిన స్టాలిన్.. తరువాత నిర్ణయిద్దామని చెప్పినట్లు తెలిసింది.

సమాచార దర్శిని

నేడు అంబత్తూర్‌లో తాగునీటి సరఫరా నిలిపివేత

ప్యారీస్, జూలై 30: మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి 24 గంటల పాటు అంబత్తూర్ ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు ప్రకటించింది. కోయంబేడు ఫ్లై ఓవర్ సమీపంలో ఉన్న తాగునీటి ప్రధాన పైపులతో చెంబరంబాక్కం 530 ఎంఎల్‌డీ తాగునీటి ప్రధాన కాలువ అనుసంధాన పనులు బుధవారం ఉదయం 9 గంటలకు చేపట్టనున్నారు. అందువల్ల ఆగస్టు 1వ తేది ఉదయం 9 నుంచి 24 గంటల పాటు అంబత్తూర్ పరిధిలోని మొగప్పేర్ ఈస్ట్, మొగప్పేర్ వెస్ట్, అన్నానగర్ వెస్ట్ ఎక్స్‌టెన్షన్, పాడి, తిరుమంగళం ప్రాంతాలకు కొళాయిల ద్వారా నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

29 పులుల దత్తత

ఐసిఎఫ్,జూలై30:పులుల దినోత్సవం సందర్భంగా స్థానిక వండలూరు జూ పార్కులో జంతు ప్రేమికులు 29 పులులను దత్తత తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పార్కులో వన్యమృగాలు, సరీసృపాలు, పక్షులను సంరక్షిస్తున్నారు. 'ఇన్నర్‌వీల్ క్లబ్, ఫినిక్స్ సంఘం ఆధ్వర్యంలో జంతువుల దత్తత పథకం కింద సోమవారం 29 పులులను జంతు ప్రేమికులు దత్తత తీసుకున్నారు. పులుల పర్యవేక్షణ, సంరక్షణకు అయ్యే ఖర్చుల చెక్‌ను పార్క్ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్‌కు అందజేశారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, జూలై 30: కోవై -భగత్ కి కోఠి మధ్య నడిపే వారాంతపు ప్రత్యేక రైలు సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06181 కోయంబత్తూర్-భగత్ కి కోఠి (జోద్‌పూర్) ప్రత్యేక వారాంతపు రైలు ఆగస్టు 1,8,15,25, సెప్టెంబరు 5,12,19,26 తేదీల్లో మధ్యాహ్నం 2.30 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి మూడో రోజు ఉదయం 11.30 గంటలకు భగత్ కి కోఠి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06182 భగత్ కి కోఠి-కోయంబత్తూర్ ప్రత్యేక వారాంతపు రైలు ఆగస్టు 4,11,18,25, సెప్టెంబరు 1,8,15,22,29 తేదీల్లో రాత్రి 7.30 గంటలకు భగత్ కి కోఠిలో బయల్దేరి నాలుగవ రోజు ఉదయం 9.30 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది.

రూ.850 కోట్లతో గ్రీన్ అమ్మోనియ కర్మాగారం

ఐసిఎఫ్, జూలై 30: తిరునల్వేలి జిల్లా గంగైకొండాన్ సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్కులో రూ.850 కోట్లతో గ్రీన్ అమ్మోనియ కర్మాగారం ఏర్పాటుకానుంది. రాష్ట్రానికి చెందిన కేఆర్ఆర్ ఎయిర్ సంస్థ ఈ కర్మాగారం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. టిడ్కోతో కలిసి 5 టన్నుల అమ్మోనియ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన కర్మాగారం నిర్మాణాలను ప్రారంభించింది. ఇందుకు అవసరమయ్యే విద్యుత్ కోసం 100 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ స్టేషన్ కూడా ఏర్పాటుచేయనుంది. వచ్చే ఏడాదిలోగా కర్మాగారంలో ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రియం వెంకట్ తెలిపారు.

వృత్తుల లైసెన్స్ ఛార్జీల పెంపు

ఐసిఎఫ్, జూలై 30: చెన్నై కార్పొరేషన్‌లో సంస్థల వృత్తుల లైసెన్స్ రుసుమును రూ.500 నుంచి రూ.15,000లకు పెంచారు. నగరంలోని కర్మాగారాలు, సంస్థలు కార్పొరేషన్‌లో నమోదుచేసుకొని లైసెన్స్ పొందాల్సి ఉంది. లైసెన్స్ రుసుము, రెన్యువల్ రుసుమును అప్పుడప్పుడూ కార్పొరేషన్ పెంచుతోంది. ఆ ప్రకారం రూ.500గా ఉన్న రుసుము చిన్న వర్తకులకు రూ.3,500 నుంచి రూ.7,000, మధ్యాతరహా వర్తకాలకు రూ.10,000, పెద్ద వర్తకాలకు రూ.15,000 పెరిగింది.

రూ.63 లక్షలతో పాఠశాలకు కొత్త భవనం

ఐసిఎఫ్, జూలై 30: స్థానిక వలసరవాక్కం మండలం నెర్కుండ్రంలో ఉన్న పాఠశాలకు రూ.63 లక్షలతో కొత్త భవనం నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. 148వ వార్డు మేట్టుకుప్పం రోడ్డులో ఉన్న కార్పొరేషన్ మాధ్యమిక పాఠశాలలో 100 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదులు తక్కువగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు రూ.63.7 లక్షల వ్యయంతో కొత్త భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

ప్లస్ టూ రీ వాల్యుయేషన్ మార్కుల జాబితా

ఐసిఎఫ్, జూలై 30: ప్లస్ టూ రీ వాల్యుయేషన్ మార్కుల జాబితా పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మార్చిలో ప్లస్ టూ పరీక్షలు రాసిన విద్యార్థుల్లో కొంతమంది జవాబు పత్రాల నకళ్లు కోరుతూ, రీ టోటల్, రీ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి జవాబు పత్రాలు నకళ్లు గత వారం అందజేయగా, ప్రస్తుతం రీ వాల్యుయేషన్ మార్కుల జాబితా అందజేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి ఒరిజినల్ మార్కుల జాబితా అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. వీటిని విద్యార్థులు తాము చదివిన పాఠశాలలోను, ప్రైవేటు విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోను పొందవచ్చు.

ఆగస్టులో ఎలిఫెంట్ గేట్ ఫ్లై ఓవర్ ప్రారంభం

ఐసిఎఫ్, జూలై 30: స్థానిక ఎలిఫెంట్ గేట్ ఫ్లై ఓవర్‌ను ఆగస్టు మొదటి వారంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. రాయపురం మండలం 57వ వార్డులో ఉన్న ఈ ఫ్లై ఓవర్ నిర్మాణపనులు రూ.82.6 కోట్లతో 2020లో ప్రారంభమయ్యాయి. కరోనా లాక్‌డౌన్, ఇతర కారణాలతో పనుల్లో జాప్యం జరిగింది. ఇటీవల వాల్‌టాక్స్ రోడ్డు నుంచి రాజాముత్తయ్య రోడ్డును కలుపుతూ వన్‌వేను మూడు నెలల క్రితం ఎంపీ దయానిధి మారన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, మరో భాగాన్ని ఆగస్టు మొదటి వారంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు.

4న ఎంసీటీబీసీలో పాటల పోటీలు

ప్యారీస్, జూలై 30: స్థానిక వెప్పేరి హైరోడ్డులోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ)లో ఆగస్టు 4వ తేది పాటల పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు సంఘకాపరి రెవ.డా.ఎస్.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ప్రారంభం కానున్న ఈ పోటీల్లో నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న సంఘ అనుబంధ చర్చిల నిర్వాహకులు, స్త్రీలు, యువజనులు, సండే స్కూల్ చిన్నారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. వివరాలకు సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ (98407 94256)ను సంప్రదించవచ్చు.

43వ సారి పూర్తిస్థాయికి మేట్టూరు డ్యాం

పెరంబూర్, జూలై 30: సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటిమట్టం 43వ సారిగా 120 అడుగుల పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. దీంతో, కావేరి నుంచి వస్తున్న జలాలు అలాగే దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో డ్యాంకు 60,000 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, డెల్టా జిల్లాలకు డిసెంబరు వరకు మేట్టూరు డ్యాం నుంచి సాగునీటిని విడుదల చేయాలని సీఎం స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు.

టోల్‌గేట్ ముట్టడి యత్నం

● ఆర్బీ ఉదయకుమార్ అరెస్టు



ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్‌తో మాట్లాడుతున్న మదురై ఎస్పీ అరవింద్

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపంలోని కప్పలూరు టోల్‌గేట్‌ను మరో చోటుకు మార్చాలని డిమాండ్ చేస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జరిగిన ఆ టోల్‌గేట్ ముట్టడి యత్నం ఆందోళనలో మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం ఆ టోల్‌గేట్‌ను మరొక ప్రాంతానికి మార్చాలని కోరుతూ తిరుమంగళంలో సంపూర్ణ బంద్ జరిగింది. గతవారం ఇదే డిమాండ్‌పై ఆందోళనకు దిగిన ఆర్బీ ఉదయకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం కూడా ఆయన టోల్‌గేట్‌ను ముట్టడించేందుకు పార్టీ శ్రేణులతో కలిసి ఊరేగింపుగా వెళ్లారు. మార్గమధ్యంలో జిల్లా ఎస్పీ అరవింద్ అడ్డుకుని ఆయనతో చర్చించారు. అవి ఫలించకపోవడంతో ఆర్బీ ఉదయకుమార్, పార్టీ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో జరిపారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి ఆర్బీ ఉదయకుమార్ సహా పార్టీ కార్యకర్తందరిని అరెస్టు చేశారు.

తాంబరం కార్పొరేషన్ సమావేశం నుంచి అన్నాడీఎంకే వాకౌట్



వాకౌట్ చేస్తున్న అన్నాడీఎంకే కార్పొరేటర్లు

ప్యారీస్, జూలై 30: స్థానిక తాంబరం కార్పొరేషన్ పరిధిలో సమస్యలపై మాట్లాడేందుకు అనుమతించలేదంటూ అన్నాడీఎంకే కార్పొరేటర్లు మంగళవారం సమావేశం నుంచి వాకౌట్ చేశారు. తాంబరం కార్పొరేషన్ మేయర్ వసంతకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో ఓ భవన నిర్మాణ సంస్థ అవినీతికి పాల్పడిందని, కార్పొరేషన్ పరిధిలో కొత్తగా ఏర్పాటుచేసిన వీధి బోర్డుల్లో తమిళ అక్షరాల్లో తప్పులున్నాయని, తాంబరం ప్రాంతంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందన్న అన్నాడీఎంకే కార్పొరేటర్లు ఈ సమస్యలపై మాట్లాడేందుకు అనుమతి కోరగా మేయర్ నిరాకరించారు. దీంతో మేయర్ వైఖరిని ఖండిస్తూ కుక్క బొమ్మలతో నినాదాలు చేస్తూ వాకౌట్ చేశారు.

భక్తులకు 'కారాభిషేకం'



కారంతో అభిషేకం చేస్తున్న దృశ్యం

పెరంబూర్, జూలై 30: విల్లుపురం జిల్లా మయిలం సమీపం తెన్‌పసియార్ గ్రా మంలోని బాలమురుగన్ ఆలయంలో ఆడికృతిక వేడుకలు ఈ నెల 26న ప్రారంభమయ్యాయి. అదే రోజు రాత్రి 8 గంటలకు తిరుకల్యాణం నిర్వహించారు. ఆడికృతిక సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, 9 గంటలకు మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా రాగా స్వామివారికి క్షీరాభిషేకం జరిగింది. అనంతరం భక్తులకు కారంతో అభిషేకం చేశారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిరువాపురి మురుగన్ ఆలయంలో క్యూ ఆర్ కోడ్ ద్వారా విరాళాల సేకరణ

పెరంబూర్, జూలై 30: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళయం సమీపంలోని సిరువాపురి గ్రామంలో బాలసుబ్రమణ్యస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి నిత్యం పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన భక్తులు వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు 100 మందికి, పండుగలు, విశేష దినాల్లో 500 మందికి అన్నదానం చేస్తుంటారు. అన్నదానానికి పలువురు దాతలు విరాళాలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో, భక్తులు అందించే విరాళాలు ఇకపై క్యూ ఆర్ కోడ్ ద్వారా నేరుగా ఆలయ బ్యాంక్ ఖాతాలోకి వెళ్లే సదుపాయం తెచ్చారు.. ఆడికృతిక సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి కార్తికేయన్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ వేలూరు మండల మేనేజర్ వెంకటేశ్వర్లు, సిరువాపురి ఆలయ ప్రధాన అర్చకులు ఆనందన్ తదితరులు భక్తులు క్యూ ఆర్ కోడ్ ద్వారా విరాళాలు అందించే సౌకర్యం ప్రారంభించారు.

దేశీయ విమానాల్లో తమిళంలో ప్రకటనపై 3 నెలల్లో నిర్ణయం

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జూలై 30: దేశీయ విమానాల్లో తమిళంలో ప్రకటన చేసే విషయమై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని కేంద్ర పౌర విమానాయాన శాఖకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఉత్తర్వులు జారీచేసింది. శ్రీలంక, సింగపూర్, మలేసియా దేశాల్లో ఉన్నట్లు తమిళంలో కూడా విమానాల ప్రయాణాన్ని ప్రకటించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

వాట్సాప్ ద్వారా మత్తు ఇంజక్షన్ల విక్రయం

● నలుగురి అరెస్ట్

పెరంబూర్, జూలై 30: స్థానిక వాషర్‌మెన్‌పేట ప్రాంతంలో వాట్సాప్ ద్వారా మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. న్యూ వాషర్‌మెన్‌పేట బర్మాపేటలో ఉన్న ఓ పాడుపడిన భవనంలో కొందరు మాదక ద్రవ్యాలు సేవిస్తున్నారని వాషర్‌మెన్‌పేట పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, అక్కడున్న ఇద్దరు యువకులు మత్తు కోసం నొప్పి నివారణ మాత్రలు, మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వారిచ్చిన సమాచారంతో, కాశిమేడు వినాయకపురానికి చెందిన ఆటో డ్రైవర్ మణికంఠన్, వాషర్‌మెన్‌పేటకు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఆనంద్, రిచ్ స్ట్రీట్‌లోని ఓ మొబైల్ దుకాణంలో పనిచేస్తున్న ఆర్కే నగర్ కు చెందిన అజిత్, నేతాజీ నగర్‌కు చెందిన జావిద్ షరీఫ్‌లను అరెస్ట్ చేసి, వారి నుంచి 150 మత్తు మాత్రలు, రెండు మోటారు సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరు నలుగురు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి మత్తు బిళ్లలు, మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు తెలిసింది.

డీఎంకే మైనార్టీ విభాగం నిర్వాహకుడి సస్పెన్షన్

పెరంబూర్, జూలై 30: రామనాథపురం జిల్లా డీఎంకే మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు కె.సయ్యద్ ఇబ్రహీంను పార్టీ నుంచి తొలగించారు. కిళంబాకం బస్ టెర్మినల్‌లో రూ.70 కోట్ల విలువైన మాదకద్రవ్యం పట్టుబడిన వ్యవహారంలో సయ్యద్ ఇబ్రహీంను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో, సయ్యద్ ఇబ్రహీంను పార్టీ పదవితో పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

ప్రజలను దోచుకుంటున్న టోల్‌గేట్లను తొలగించాలి

● రాజ్యసభలో ఎంపీ విల్సన్ డిమాండ్

ప్యారీస్, జూలై 30: దేశవ్యాప్తంగా ప్రజల నుంచి దోచుకుంటున్న టోల్‌గేట్లను తొలగించాలంటూ రాజ్యసభలో డీఎంకే ఎంపీ విల్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... దేశంలో రోజురోజుకు టోల్ గేట్ల సంఖ్యతో పాటు ప్రతి ఏటా క్రమం తప్పకుండా టోల్ పన్ను కూడా పెంచుతున్నందున ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. తమిళనాడులో ఏర్పాటుచేసిన 65 టోల్‌గేట్లలో కనీసం ఐదు టోల్‌గేట్లు కార్పొరేషన్, మున్సిపాలిటీ సరిహద్దుల నుంచి 10 కి.మీ దూరంలోనే ఉన్నాయని, మరో 20కి పైగా టోల్‌గేట్లు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేశారని, అందువల్ల వీటిని వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలో ఉన్న బరనూరు టోల్‌గేట్ రూ.28.54 కోట్లకు పైగా వాహనదారుల నుంచి పన్ను వసూలుచేసిందని, ఈ టోల్‌గేట్‌లో వాహన పన్ను తగ్గించాలని పలు మార్లు రాజ్యసభలో ప్రస్తావించినా ఎలాంటి చర్యలు లేవన్నారు. దేశప్రజలను ఆర్థికపరంగా నష్టపరుస్తున్న టోల్‌గేట్లను తొలగించాలని, వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే ఒకేసారి పన్నుగా కొంత నగదును వసూలుచేయాలని ఎంపీ విల్సన్ కోరారు.

త్వరలో తలైవాసల్ వెటర్నరీ పార్కు సిద్ధం

రూ.564 కోట్లతో నిర్మాణం ● మంత్రి అనితా రాధాకృష్ణన్

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా తలైవాసల్‌లో గత అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రారంభించిన వెటర్నరీ పార్కు నిర్మాణ పనులు త్వరలో పూర్తవుతాయని పశుసంవర్ధక మత్స్యశాఖమంత్రి అనితా రాధాకృష్ణన్ తెలిపారు. 2019లో ప్రారంభించిన ఈ పథకాన్ని డీఎంకే ప్రభుత్వం విస్మరించిందంటూ ప్రతిపక్షనాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించడం గర్హనీయమన్నారు. 1866 ఎకరాల్లో రూ.564.44 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో ఆ పశు సంవర్ధక పరిశోధనా కేంద్రం, పశుదాణా తయారీ ప్లాంట్ సహా అన్ని భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని వివరించారు. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని, ఈ విషయంలో ఈపీఎస్ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని అనితా రాధాకృష్ణన్ అన్నారు.

ఎనిమిది రోజుల్లో 3,358 మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు



విధుల్లో పారిశుధ్య కార్మికులు

పెరంబూర్, జూలై 30: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 15 మండలాల్లో ఎనిమిది రోజుల్లో 3,358.33 మెట్రిక్ టన్నుల చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించారు. ఈ మేరకు జీసీసీ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... నగరంలోని రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించే పనులు ఈ నెల 22వ తేది నుంచి రాత్రి వేళల్లో చేపట్టామన్నారు. రోజుకు 3,4 మండలాల్లో పారిశుధ్య కార్మికులు, 540 వాహనాల ద్వారా చెత్త తొలగిస్తున్నారని తెలిపారు. 22 నుంచి ఈ నెల 28వ తేది వరకు 15 మండలాల పరిధిలోని 488 రోడ్లలో శుభ్రం చేయగా ఎనిమిది రోజుల్లో 3,358.33 మెట్రిక్ టన్నుల చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించామని, ఈ పనులు ఆగస్టు 10వ తేది వరకు కొనసాగుతాయని జీసీసీ తెలిపింది.

పళనిలో దుకాణాల తొలగింపునకు చర్యలేంటి...?

● హైకోర్టు ప్రశ్న

పెరంబూర్, జూలై 30: పళని మున్సిపాలిటీలో అనుమతి లేకుండా నిర్మించిన 487 దుకాణాల తొలగింపునకు తీసుకున్న చర్యలేంటని హైకోర్టు మదురై బెంచ్ ప్రశ్నించింది. పళని మురుగన్ ఆలయం సమీపంలోని ఆక్రమణ దుకాణాలు తొలగించాలని హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం, ఈ వ్యవహారంపై అఫిడవిట్ దాఖలుచేయాలని పళని మున్సిపాలిటీ, జిల్లా యంత్రాంగానికి నోటీసులు జారీచేసింది.

23 మంది రాష్ట్ర జాలర్ల విడుదల

పెరంబూర్, జూలై 30: శ్రీలంక జైళ్లలో ఉన్న 23 మంది రాష్ట్ర జాలర్లను విడుదల చేస్తూ ఆ దేశ న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. సరిహద్దులు దాటారంటూ రామనాథపురం, పుదుకోటకు చెందిన జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. వారిలో 23 మందిని విడుదల చేసిన న్యాయస్థానం, రెండో సారి సరిహద్దు దాటి పట్టుబడ్డారంటూ ముగ్గురు జాలర్లకు 18 నెలల జైలుశిక్ష విధించింది. కాగా, శిక్ష పడిన జాలర్లను కూడా విడిపించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పోక్సో కేసుల్లో ఉత్తరాది యువకుడి అరెస్ట్

హోసూరు(క్రైం) జూలై 30 : హోసూరు సమీపంలోని బత్తలపల్లిలో నివాసముంటున్న ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అజయ్‌కుమార్(20) హోసూరు రెండో సిప్‌కాట్‌లోని ఓ కర్మాగారంల్లో పనిచేస్తున్నాడు. అక్కడికి సమీపంలోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక(14)ను ప్రేమపేరుతో నమ్మించి తన గదికి తీసుకువచ్చాడు. దీనిపై బాలిక తల్లి హోసూరు మహిళా పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పోలీసులు అతడ్ని పోస్కో చట్టంపై అతని అరెస్ట్ చేసి దర్మపురి జైలుకు తరలించారు.

తాంబరంలో రూ.4 కోట్లు స్వాధీనం కేసు.. ఈరోడ్ రైల్వే క్యాంటీన్ యజమానికి సమన్లు

ప్యారీస్, జూలై 30: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో తాంబరం రైల్వేస్టేషన్‌లో రూ.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్న కేసులో ఈరోడ్ రైల్వేస్టేషన్ క్యాంటీన్ యజమాని ముస్తఫాకు సీబీసీఐడీ సమన్లు జారీచేసింది. మార్చి 26వ తేది తాంబరం రైల్వేస్టేషన్ నుంచి నెల్లై ఎక్స్‌ప్రెస్‌లో తరలించేందుకు యత్నించిన రూ.4 కోట్ల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసు విచారిస్తున్న సీబీసీఐడీ ఇప్పటివరకు బీజేపీ ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్, ఆయన బంధువు మురుగన్, ఆసైతంబి, జయశంకర్, బీజేపీ పరిశ్రమల శాఖ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ సహా 15 మందిని వేర్వేరుగా విచారణ జరిపింది. ఈ కేసులో మరిన్ని ఆధారాల కోసం ఈరోడ్ రైల్వే క్యాంటీన్ యజమాని ముస్తఫా వచ్చే వారం విచారణకు హాజరుకావాల్సిందిగా సమన్లు జారీచేసినట్లు సీబీసీఐడీ అధికారులు తెలిపారు.

శరభంగా పథకాన్ని విస్మరించిన డీఎంకే



● ఈపీఎస్ ధ్వజం

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మేట్టూరు జలాశయంలోకి ప్రవేశించే అదనపు జలాలను నిల్వ చేసుకునేందుకు వీలుగా గత అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రతిపాదించిన శరభంగా చెరువు ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, ఫలితంగా జలాలు సముద్రంలో వృథాగా కలుస్తున్నాయని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. మేట్టూరు డ్యామ్‌లో నీటిమట్టం 120 అడుగులకు చేరినప్పుడల్లా అదనపు జలాలను సముద్రంలోకి వదులుతున్నారని, అదనపు జలాలను సేలం జిల్లా శరభంగా ప్రాంతంలో ఉన్న 100 చెరువులకు మళ్ళించే ప్రాజెక్టును రూ.565కోట్లతో చేపట్టాలని తన నాయకత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రతిపాదించిందని, ఆ ప్రాజెక్టుకు తాను శంకుస్థాపన కూడా చేశానని, అయితే అధికారంలోకి వచ్చిన డీఎంకే పాలకులు ఆ ప్రాజెక్టును బుట్టదాఖలు చేశారని ఈపీఎస్ ఆరోపించారు.

విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన... దంత వైద్యుడి అరెస్ట్

ప్యారీస్, జూలై 30: పుదుకోటలో చికిత్స కోసం వచ్చిన విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన దంత వైద్యుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. పుదుకోట ప్రభుత్వ మ్యూజియం సమీపంలో తిరుగోకర్ణం మేట్టు వీధికి చెందిన అబ్దుల్ మజీద్ (36) అనే దంత వైద్యుడి క్లినిక్‌కు సోమవారం 17 ఏళ్ల విద్యార్థిని తన తల్లితో కలిసి చికిత్స కోసం వెళ్లింది. దంతాలు పరీక్ష చేస్తున్నట్లు నటించిన ఆ వైద్యుడు విద్యార్థిని పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు సమాచారం. దీనిపై విద్యార్థిని తల్లి అందజేసిన ఫిర్యాదుతో పుదుకోట టౌన్ మహిళా పోలీసులు మంగళవారం ఉదయం అబ్దుల్ మజీద్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు.

గోపురం నుంచి కిందపడి భక్తుడి మృతి

ప్యారీస్, జూలై 30: స్థానిక తిరువాన్మియూర్‌లో ఉన్న మరుందీశ్వరర్ ఆలయ గోపురం నుంచి కిందపడిన భక్తుడు మృతిచెందిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఆలయాన్ని సుమారు 30 మందికి పైగా శివ భక్తులు శుభ్రం చేస్తున్నారు.. సోమవారం 30 అడుగుల ఎత్తులో ఉన్న గోపుర కలశాలను కొట్టివాక్కంకు చెందిన పళని (44) అనే శివ భక్తుడు శుభ్రం చేస్తూ కాలుజారి కిందపడిపోయాడు. ఆయనకు తీవ్రగాయాలై స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆలయ నిర్వాహకులు రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి దారిలోనే మరణించినట్లు నిర్ధారించారు. తిరువాన్మియూర్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

వయనాడు ఘటనలో ఒకరి మృతి


● కుటుంబానికి రూ.3 లక్షల సాయం

పెరంబూర్, జూలై 30: వయనాడు ఘటనలో చిక్కుకొని మృతిచెందిన రాష్ట్రానికి చెందిన కాళిదాస్ కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. నీలగిరి జిల్లా సూలూరు తాలూకా మరప్పాలం అడ్డుకొల్లి ప్రాంతానికి చెందిన కాళిదాస్ (34) భవన నిర్మాణపనులకు కేరళ రాష్ట్రం వయనాడు జిల్లాలోని ముండగ్రైసూరల్ మలైలోని బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో, మంగళవారం వేకువజామున మట్టిచెరియలు విరిగిపడడంతో కాళిదాస్ మృతిచెందాడు. ఈ విషయమై సీఎం స్టాలిన్ స్పందిస్తూ... వయనాడు ఘటనలో రాష్ట్రానికి చెందిన కాళిదాస్ మృతిచెందడం ఆవేదన కలిగిస్తుందని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ రూ.3 లక్షల పరిహారం అందజేయనున్నట్లు సీఎం తెలిపారు.

సెంథిల్ బాలాజీ రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జూలై 30: మాజీ మంత్రి సెంథిల్ బాలాజి రిమాండ్‌ను 51వ సారి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు పొడిగించింది. చట్ట వ్యతిరేక నగదు బట్వాడా కేసులో గత ఏడాది జూన్ 14వ తేది ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. ఆయనకు విధించిన రిమాండ్ గడువు మంగళవారంతో ముగిసింది. దీంతో, జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సెంథిల్ బాలాజీని న్యాయమూర్తి విచారించి 51వ సారిగా రిమాండ్‌ను ఆగస్టు 2వ తేది వరకు పొడిగించడంతో పాటు, ఆరోజున ఆయనను కోర్టులో హాజరుపరచాలని ఉత్తర్వులు జారీచేశారు.

కుంకీ ఏనుగుల సాయంతో పట్టుబడిన ఏనుగు



అదుపులో ఏనుగు

హోసూరు జూలై 30: హోసూరు సమీపంల్లోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ముగ్గురిని బలితీసుకున్న ఏనుగును 8 కుంకీ ఏనుగుల సాయంతో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని ఆనేకల్ సమీపంల్లోని బన్నేరుఘట్ట నేషనల్ పార్క్ పక్కనే ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఏనుగు సంచరిస్తూ ప్రజలు, రైతులపై దాడిచేయడంతో ముగ్గురి మరణించారు. దీంతో ప్రాంత ప్రజలు , గ్రామస్తులు ఆ ఏనుగు బారినుంచి రక్షించాలని అటవీశాఖ అధికారులను కోరారు. ఈ క్రమంల్లో కర్ణాటక రాష్ట్రంలోని దుబరే, మత్తికోడు క్యాంపుల నుంచి 8 కుంకీ ఏనుగులను రప్పించి వాటి సాయంతో అటవీశాఖ సిబ్బంది అడవిలోకి వెళ్లి అడవి ఏనుగు కోసం గాలించారు. ఆ ఏనుగు ఆచూకి కోసం డ్రోన్ కెమరాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అది లోయల్లో ఉన్నట్లు తెలిసింది. మత్తు మందు నిపుణుడు రంజన్‌తో పాటు వెళ్లి కుంకీ ఏనుగుల సహాయంతో అడవి ఏనుగుకు తుపాకీ తో మత్తుమందు వేశారు. కిలోమీటరు వరకు వెళ్లిన ఆ అడవి ఏనుగు స్పృహ కోల్పోయి పడిపోయింది. భీమా, మహేంద్ర అనే కుంకీ ఏనుగుల సాయంతో అడవి ఏనుగును లారీలో ఎక్కించి బన్నేరుఘట్ట నేషనల్ పార్క్ సమీపంలోని సిగ్గేకట్టు ఏనుగుల శిబిరానికి తరలించారు.

'విడాముయర్చి' నుంచి అర్జున్ ఫస్ట్‌లుక్

మగిళ్ తిరుమేని దర్శకత్వంలో అజిత్ కుమార్ హీరోగా నటించిన 'విడాముయర్చి' చిత్రం నుంచి యాక్షన్ కింగ్ అర్జున్ లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో సింహభాగం అజర్‌బైజాన్‌లో చిత్రీకరించారు. ఈ షెడ్యూల్ పూర్తి చేసుకుని ఇటీవలే చెన్నై చేరుకున్న చిత్ర బృందం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరిస్తోంది. అజిత్ కుమార్, త్రిష, ఆరవ్, రెజీనా తదితరులు కీలక పాత్రలు పోషించారు. లైకా ప్రొడక్షన్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా నుంచి ఇప్పటివరకు మూడు పోస్టర్లు రిలీజ్ చేయగా, తాజాగా అర్జున్ లుక్ విడుదల చేశారు. ఇందులో అర్జున్ రోడ్డుపై నిలబడి ఉండగా, బ్యాక్‌డ్రాప్‌లో అజిత్ ఫొటో ఉంది. దీపావళికి విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



'విడాముయర్చి'లో అర్జున్

1800 మంది కళాకారులు.. 100 పాటలు.. 100 నిమిషాలు

చిత్రజ్యోతి



'పేచ్చి' చిత్రంలో ఓ దృశ్యం

అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ నృత్య దర్శకుడు ప్రభుదేవా సమక్షంలో 1800 మంది డ్యాన్సర్లు ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఈ కళాకారులంతా కలిసి 100 ప్రభుదేవా పాటలకు 100 నిమిషాల పాటు డ్యాన్స్ చేసి ఈ రికార్డు సృష్టించారు. తిరువళ్ళూరు జిల్లా పొన్నేరి తాలూకా మాధవరంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో చెన్నై నగర వాసులతో పాటు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుదేవా జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించగా, ఆయన కొరియోగ్రఫీ చేసిన 100 పాటలకు 100 నిమిషాల పాటు డ్యాన్స్ చేశారు. ఒక నిమిషానికి ఒక పాట చొప్పున సమయం కేటాయించారు. తద్వారా ఇంటర్నేషనల్ ప్రైడ్ వరల్డ్ రికార్డు సాధించగా, ప్రపంచ రికార్డుకు సంబంధించిన ప్రశంసా పత్రాన్ని ప్రభుదేవా అందజేశారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం ప్రభుదేవా వీక్షిస్తూ ఎంజాయ్ చేశారు. ఇందులో దర్శకుడు రాబర్ట్, నటుడు రోబో శంకర్, నటి ఇందుజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుదేవా సారథ్యంలో డ్యాన్స్





నృత్యం చేస్తున్న డ్యాన్సర్లు - కళాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రభుదేవా

2న విడుదలకు సిద్ధంగా 6 చిత్రాలు

ఆగస్టులో పలు చిత్రాలకు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. 15వ తేదీ భారీ బడ్జెట్ సినిమాలు విడుదలవుతున్నాయి. ఆగస్టులో మొదటి శుక్రవారమైన రెండో తేదీ ఏకంగా ఆరు చిత్రాలు ప్రేక్షకుల ముందుకురానున్నాయి. వీటిలో 'జమా', 'బోట్', 'మళై పిడిక్కాద మనిదన్', 'నన్బన్ ఒరువన్ వంద పిరగు', 'పేచ్చి', 'వాస్కోడిగామ' వంటి సినిమాలున్నాయి. వీటిలో యోగిబాబు - గౌరి కిషన్ జంటగా నటించిన 'బోట్' చిత్రం, కొత్త దర్శకుడు పారి ఇలవళగన్ స్వయంగా నటించి,దర్శకత్వం వహించిన 'జమా'చిత్రాలపై భారీ అంచనాలున్నాయి. ఇతర చిత్రాలతో పోలిస్తే ఈ రెండు సినిమాలు ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా విజయ్ ఆంటోనీ నటించిన 'మళై పిడిక్కాద మనిదన్', నకుల్ నటించిన 'వాస్కోడిగామ', బాలశరవణన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'పేచ్చి', ఆనంద్ దర్శకత్వం వహించిన నటించిన 'నన్బన్ ఒరువన్ వంద పిరగు' వంటి చిత్రాలు కూడా మంచి సందేశాత్మక కంటెంట్, హాస్యభరిత చిత్రాలుగా రూపొందాయని, వాటిని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకాన్ని పరిశ్రమ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. కాగా, జూన్ లో కమల్ హాసన్ - శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్-2', ధనుష్ నటించి దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రాలు ఆశించిన స్థాయిలో హిట్ టాక్ సొంతం చేసుకోలేకపోయాయి.



కెరీర్‌లో టర్నింగ్ పాయింట్

- మేఘా ఆకాష్ -

విజయ్ ఆంటోనీ హీరోగా విజయ్ మిల్టన్ దర్శకత్వం వహించిన 'మళై పిడిక్కాద మనిదన్' చిత్రంలో తన పాత్ర అద్భుతంగా ఉంటుందని, ఇది తన సినీ కెరీర్‌కు ఓ టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని ఆ చిత్రంలో హీరోయిన్‌గా నటించిన మేఘా ఆకాష్ అభిప్రాయపడింది. ఈ సినిమాలో తన పాత్ర గురించి ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'సాధారణంగా విజయ్ మిల్టన్ రూపొందించే సినిమాల్లో హీరోయిన్ పాత్ర ఎంతో బలంగా ఉంటుంది. ఈ సినిమాకు నన్ను సంప్రదించకముందే, స్టోరీ వినకముందే నా మనసులో ఒక బలమైన ముద్ర పడింది. ఖచ్చితంగా ఈ సినిమాల్లో నా పాత్ర బాగా ఉంటుందని ఊహించాను. నేను అనుకున్నట్టుగానే సినిమాలో మంచి పాత్ర లభించింది. ప్రతిభ నిరూపించుకునేందుకు ఓ మంచి అవకాశంగా భావిస్తున్నాను. ఈ సినిమా షూటింగ్ మొత్తం మరిచిపోలేని ఎన్నో అనుభూతులు మిగిలాయి. ఈ మంచి అవకాశాన్ని ఇచ్చిన చిత్ర బృందానికి ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

వనభద్రకాళి ఆలయంలో వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

ప్యారీస్, జూలై 30: కోవై జిల్లా మేట్టుపాళయం సమీపంలోని తేక్కంబట్టి భవాని తీరంలో ఉన్న వనభద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆడి మాస అగ్నిగుండ ప్రవేశ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో ప్రధాన అంశంగా మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు అమ్మవారు సింహ వాహనంపై ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం ఆలయ ప్రధాన పూజారి హరి బృందం మహా శాంతి పూజలు జరిపి, ఉదయం 5.30 గంటలకు భక్తులను అగ్నిగుండ ప్రవేశానికి అనుమతించారు. మేట్టుపాళయం అన్నాడీఎంకే ఎమ్మెల్యే ఏకే సెల్వరాజ్, మాజీ మంత్రి వేలుస్వామి సహా మాలధారణ చేసి ఉపవాసం చేపట్టిన వందలాది మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ ఆలయంలో ఈ ఏడాది ఆడి అగ్నిగుండ ఉత్సవం ఈ నెల 23న పుష్పాలంకరణ, లక్షార్చన, గ్రామ శాంతి, పతాకావిష్కరణ పూజలతో ప్రారంభమయ్యాయి. కొంతమంది భక్తులు తమ చంటిపిల్లలతో అగ్నిగుండంలో దిగారు. అలాగే, పరిసర ప్రాంతాల్లోని గ్రామాలకు చెందిన భక్తులు, హిజ్రాలు పాల కావళ్లు, పన్నీరు కావళ్లు, పాల కలశాలతో పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.



భక్తుల అగ్నిగుండ ప్రవేశం

ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్‌లో మలేసియా రోగులకు వైద్యసేవలు

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్‌లో మలేసియా, ఆసియా పసిఫిక్ దేశాలకు చెందిన రోగులకు వైద్యసేవలను అందించనుంది. ఆ మేరకు మంగళవారం మలేసియాకు చెందిన 'గ్లోబల్ డాక్టర్స్' సంస్థతో హాస్పిటల్స్ నిర్వాహకులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం విదేశాల్లో ఉన్న రోగులకు ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్ వైద్యనిపుణులు టెలీ కన్సల్టేషన్ నిర్వహించనున్నారు. ఒప్పందంపై సంతకాల కార్యక్రమంలో గ్లోబల్ డాక్టర్స్ సంస్థ నిర్వాహకులు దత్తో డాక్టర్ షరీఫా ఫౌజియా అల్లాబక్స్, డాక్టర్ నవీంద్ర నాగేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ గ్లోబల్ డాక్టర్స్‌తో అవగాహన కదుర్చుకోవడంతో తమ గ్లోబల్ హాస్పిటల్స్ వైద్య సేవలకు విదేశాలకు విస్తరించనుండటం తమకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్, గ్లోబల్ డాక్టర్ సంస్థ నిర్వాహకుల

కాలడిపేటలో ఉద్రిక్తత

● రోడ్‌సైడ్ దుకాణాల తొలగింపు ● వ్యాపారుల రాస్తారోకో



కాలడిపేట మార్కెట్ రోడ్డులో చెల్లాచెదురుగా పడిఉన్న దుకాణాల విడిభాగాలు

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తిరువొత్తియూరు కాలడిపేట మార్కెట్ ప్రాంతంలో సుమారు 300లకు పైగా దుకాణాలున్నాయి. రోడ్డు మార్జిన్ ప్రాంతాలను ఆక్రమించి పండ్లు, మాంసం దుకాణాలు ఏర్పాటు చేసుకుని వందలాదిమంది వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఆ రహదారి నిత్యం జనంతో కిటకిటలాడుతుంటుంది. ఈ దుకాణాలతో మార్కెట్లకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు కార్పొరేషన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువజాము రెండు గంటల ప్రాంతంలో కార్పొరేషన్ అధికారులు ఎక్సకవేటర్లతో కాలడిపేట మార్కెట్ ప్రాంతానికి వెళ్ళారు. రోడ్డు మార్జిన్ ఆక్రమించి వేసి దుకాణాలను కూల్చివేశారు. ఇదే విధంగా నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డుల, ప్రకటనబోర్డులను కూడా తొలగించారు. ఇలా వందకు పైగా ఆక్రమించి వేసిన దుకాణాలను అధికారులు తొలగించారు. అయితే దుకాణాల్లో వస్తువులను అధికారులుఅ అక్కడే విడిచిపెట్టి వెళ్ళారు. ఇలా వేకువజాము కార్పొరేషన్ అధికారులు దుకాణాలు తలొగించడం పట్ల వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం ఏడుగంటలకే ఆ ప్రాంతంలో వ్యాపారులంతా గుమికూడి రాస్తారోకో నిర్వహించారు. ఈ సమాచారం తెలుసుకున్న కార్పొరేషన్ జోనల్ కమిటీ అధ్యక్షుడు తనియరసు, పోలీసు అధికారులు ఆందోళన చేస్తున్న వ్యాపారులతో చర్చలు జరిపారు. కార్పొరేషన్ ఉన్నతాధికారులతో చర్చలు జరిపి వ్యాపారులకు అనుకూలమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ విషయమై వ్యాపారులు మాట్లాడుతూ తమ దుకాణాల తొలగించే విషయమై ముందస్తు నోటీసులివ్వలేదని, రాత్రికి రాత్రే ఇలా తమ దుకాణాలను ఆనవాళ్లు కూడా తెలియని విధంగా ధ్వంసం చేయడం గర్హనీయమని పేర్కొన్నారు.



రాస్తారోకో చేస్తున్న వ్యాపారులతో చర్చిస్తున్న జోనల్ కమిటీ చైర్మన్ తనియరసు

కనువిందు చేస్తున్న మలబార్ ఉడుతలు

పెరంబూర్, జూలై 30: నీలగిరి జిల్లా కున్నూర్ ప్రాంతంలోని మలబార్ పర్వత ఉడుతలు పర్యాటకులకు కనువిందు కలిగిస్తున్నాయి. బార్లియార్, ముదుమలై సహా ఉష్ణమండల అడవుల్లో కనిపించే ఈ ఉడుతలు వాతావరణ మార్పుల కారణంగా కున్నూర్, ఊటీ ప్రాంతాలకు వలస వచ్చాయి. అత్యంత భయపడే జాతికి చెందిన ఈ ఉడుతలు జనావాసాల సమీపంలోకి రావు. ఈ నేపథ్యంలో, సిమ్స్ పార్క్ సమీపంలోని రోడ్డు పక్కనే ఉన్న నసీమా బేగం పండ్ల దుకాణానికి ప్రతిరోజూ మలబార్ పర్వత ఉడుత వస్తోంది. నసీమా ఆ ఉడుతకు పండు ఇస్తుంది. ఈ నేపథ్యంలో, అదే ప్రాంతంలోని ముత్తులక్ష్మి కిరాణా దుకాణానికి కొంతకాలంగా మలబార్ పర్వత ఉడుత జంటగా వస్తోంది. కొద్దిరోజుల క్రితం మగ ఉడుత వాహనం ఢీకొని మృతిచెందగా, ప్రస్తుతం ఆడ ఉడుత తన ఇద్దరు పిల్లలతో కలసి దుకాణానికి రాగా, ముత్తులక్ష్మి వాటికి పండ్లు ఇస్తే తిని వెళుతుంటాయి.



ఉడుతకు పండు అందిస్తున్న మహిళ

ఎయిర్‌పోర్ట్‌లో ప్రైవేట్ పార్కింగ్ మార్పు

వాహనచోదకుల ఇబ్బందులు

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం వద్ద వాహనాల పార్కింగ్ స్థలాన్ని ఆకస్మికంగా మార్చటంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విమానాశ్రయంలో దేశ, విదేశాల నుంచి విమానాల్లో వచ్చే ప్రయాణికులు అందరూ అవుటర్ గేట్‌లో బయటకు వచ్చి దిగువ అంతస్థులో ఉన్న పార్కింగ్ ప్రాంతంలోని వాహనాల్లో ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకునేవారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుండి ఆ పార్కింగ్ స్థలాన్ని అధికారులు మార్చారు. ప్రస్తుతం ఆ విమానాశ్రయంలో కొత్తగా నిర్మిస్తున్న పలుఅంతస్తుల భవన సముదాయ ప్రాంతానికి ప్రైవేటు వాహనాల పార్కింగ్ స్థలాన్ని మార్చారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లేందుకు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం ప్రైవేటు వాహనాల పార్కింగ్ స్థలం ఎక్కడుందన్న విషయాన్ని స్టీకర్లలో ప్రకటించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రూ.11.15 కోట్లతో ఏకాంబరనాథర్ స్కూలు నిర్మాణం

● పనులు పరిశీలించిన మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్‌లో రూ.11.15 కోట్ల వ్యయంతో ఏకాంబర నాథర్ మహోన్నత పాఠశాల నిర్మిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. సోమవారం ఉదయం ఆ పాఠశాల నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కీల్పాక్‌లోని ఏకాంబరనాథర్ ఆలయ స్థలంలో గతంలో సీతా కింగ్‌స్టన్ మెట్రిక్యులేషన్ పాఠశాల నడిపేవారు. ఆ పాఠశాల నిర్వాహకులు కోట్లాది రూపాయల అద్దె చెల్లించకపోవడంతో కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలం దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఆ పాఠశాలలో చదివే 600 మంది విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఆ పాఠశాలను దేవాదాయశాఖ నడిపింది. ప్రస్తుతం ఆ పాఠశాల ప్రాంగణంలో కొత్తగా 32 తరగతి గదులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక గదులు, ఐదు ప్రయోగశాల భవనాలు నిర్మిస్తున్నారు. ఆ పనులను మంత్రి శేఖర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ఈ నిర్మాణాలు పూర్తవుతాయని చెప్పారు. మంత్రితో పాటు దేవాదాయ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ సుకుమార్, చీఫ్ ఇంజనీర్ పెరియసామి, కాంచీపురం జోనల్ డిప్యూటీ కమిషనర్ వాన్‌మది తదితరులు పాల్గొన్నారు.



చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుండి తాము స్వీకరించిన జీవన్ రక్షా అవార్డులు చూపుతున్న తూత్తుకుడి జిల్లాకు చెందిన మరియ మైఖేల్, విజయకుమార్



సింగపూరులో 'ది గార్డెన్స్ బైది బే' పార్కు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం



మంగళవారం తూత్తుకుడిలోక్‌సభ నియోజకవర్గం పార్టీ నేతల సమావేశంలో పాల్గొన్న ప్రముఖులకు కొత్త గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

నేత్రపర్వంగా కుమారస్వామి తెప్పోత్సవం





నారద పుష్కరిణిలో విహరిస్తున్న సుబ్రహ్మణ్యస్వామి - ప్రత్యేకాలంకరణలో మురుగన్

శ్రీకాళహస్తి, జూలై 30: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి వార్షికోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామిని మొదట అలంకార మండపంలో విశేషంగా అలకరించి, మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య నారద పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లను తెప్పలపై అధిష్ఠింపచేసి పుష్కరణిలో పూజలు చేశారు. అనంతరం తెప్పపై విహరిస్తున్న శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. విద్యుత్ దీపకాంతుల మధ్య స్వామి అమ్మవార్లు తెప్పల్లో విహరించారు. కాగా తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని కోనేటి చుట్టూ ప్రత్యేకంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. పుష్కరణి వద్ద ఎలాంటి ఇబ్బంది రాకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఊటీలో తగ్గిన పర్యాటకుల సందడి

పెరంబూర్, జూలై 30: భారీవర్షాల కారణంగా ప్రముఖ పర్యాటక కేంద్రం నీలగిరి జిల్లా ఊటీకి వచ్చే ప్రయాణికుల సంఖ్య తగ్గింది. ఈ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలు పర్యాటకులు లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఏడాది పొడవునా ఊటీకి పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా, మే, సెప్టెంబరు సీజన్లలో పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులకు రోడ్లపై చెట్లు, మట్టిచెరియలు పడుతున్నాయి. దీంతో, ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య బాగా తగ్గడంతో వ్యాపారాలు లేవని దుకాణాల యజమానులు వాపోతున్నారు.



నిర్మానుష్యంగా ఊటీ బొటానికల్ గార్డెన్